పంటల సాగుకు వేప రక్ష

- పంటల సాగులో వేప ఉత్పత్తుల వినియోగం
- తగ్గుతున్న ఖర్చులు
- తెగుళ్ల నివారణలో కీలకం





వేపకాయలు

కోవూరు: వేప ఉత్పత్తులు అటు మానవాళికి.. ఇటు పంటల సంరక్షణకు ఎంతగానో దోహద పడుతున్నాయి. వేప చెట్టులో వేరు మొదలు.. బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు.. ఇలా సమస్తం ఔషధ గుణాలతో నిండి ఉంటాయి. ఎరువుల దుకాణదారులు సొమ్ము చేసుకోవడానికి చెప్పే మాటలను నమ్మి రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులను అధికంగా వినియోగిస్తున్నారు. తద్వారా నేల ఆరోగ్యం దెబ్బతిని భూసారం తగ్గడంతోపాటు పంటల దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. పంటల సాగులో నేల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వేప ఉత్పత్తులను వినియోగిస్తే సాగు ఖర్చు ఆదా అవుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే అధిక దిగుబడులు కూడా సాధించవచ్చని చెబుతున్నారు.

వేపతో 300 రకాల కీటకాల నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లిజాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమతోడ్సు, కొన్ని రకాల బూజు శిలీంధ్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం.. ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణలో కీలకం

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు స్ప్రే చేసినపుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. ఇది పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి జీవరాసులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగుమందులు, శిలీంధ్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

పిచికారీకి సానుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేక సాయంత్రం) పిచికారీ చేయాలి. 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ఆ ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేపగింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చి మీద వచ్చే జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. వేరుశనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుమచ్చ తెగులు, టమాటో సాగులో ఎండు తెగులును వేపనూనెతో నివారించవచ్చు.

ఇంట్లోనే వేప కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోని మహిళలే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలు నలగగొట్టి, 6 నుంచి 7 లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

వేపతో మంచి ఫలితాలు

“ వేప గింజల నుంచి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేపచెక్క, ఎండిన వేపకాయలను దంచగా వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మతోటలకు వాడవచ్చు. వేప ఉత్పత్తులను వాడి రైతులు మంచి ఫలితాలు పొందవచ్చు.

– ఇందిరావతి, వ్యవసాయాధికారి, కోవూరు

క్లుప్తంగా

వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి మార్గంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద హోమ గుండం వేసి ధునిపూజ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డైకస్ రోడ్డు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కలెక్టరేట్, వైఎంసీఏ, జెడ్పీ విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వాహబ్‌పేట, ఆచారివీధి, కలెక్టరేట్, మద్యపతివారివీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అభిషేకం, గిరిప్రదక్షిణ ఉత్సవం



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, గిరిప్రదక్షిణ ఉత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నెల్లూరుకు చెందిన గిరీష్‌కుమార్ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాల్లో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో శనివారం జిల్లాకు చెందిన విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల బకాయిలపై దృష్టి సారించాలని, విద్యుత్ వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) శేషాద్రిబాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఆరా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శనివారం పర్యటించారు. డివిజన్‌లోని ద్వారకామాయినగర్, శ్రీనగర్, ఏసీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పంటల సాగుపై అవగాహన



విడవలూరు: పంటల సాగుపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి మహేష్ అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో శనివారం నోకియా బాల రక్ష భారత్ సంస్థ సహకారంతో సంస్థ సీఎఫ్ బాబు వరి, వేరుశనగ పంట రైతులకు సాగుబడిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ తగిన మోతాదులో ఎరువులు వేసుకుని రైతులు మంచి దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం రైతులకు ఇఫ్కో బ్యాగులు అందించారు. కార్యక్రమంలో ఇఫ్కో శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, ఫిషరీస్ అధికారి నాగరాజు, జెడ్‌బీఎన్‌ఎఫ్ మహేంద్ర, గోపీనాథ్, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేట బర్మాషెల్‌గుంట వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు, బిస్కెట్లు శనివారం అందజేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు దూబిశెట్టి కల్యాణి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హుస్సేన్, సుభాషిణి, చరిత, ధనలక్ష్మి, రాము, లక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థినులు

వెంకటాచలం: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని సుపోషణ్ ప్రాజెక్ట్ అధికారిణి కొంగి మాతమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, ముత్యాలగుంట, మల్లిగుంట సంఘం గ్రామాల్లో అదానీ ఫౌండేషన్, అదానీ విల్మార్ ఆధ్వర్యంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులతో పలు యోగాసనాలు సాధన చేయించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సుపోషణ్ ప్రాజెక్ట్ ప్రతినిధులు వనిత, సుమతి, భూమిక, చందన, రేవతి, శోభ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తోడేరులో ‘నేను బడికి పోతా’



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పొదలకూరు: ‘నేను బడికి పోతా’ కార్యక్రమంలో భాగంగా పొదలకూరు మండలంలోని తోడేరు గ్రామంలో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా ఉన్న కాకాణి శేషమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలోని అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించి, బడి బయట ఉన్న విద్యార్థులంతా బడిలో చేరాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రేణుక మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తోడేరు, రత్నగిరి, శాంతినగర్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిక్కిలింపేటలో ‘అంగన్‌వాడీ పిలుస్తోంది’



కొడవలూరు: మండలంలోని మిక్కిలింపేటలో ‘అంగన్‌వాడీ పిలుస్తోంది’పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతో బోధన సాగుతుందన్నారు. తద్వారా చిన్నారులు ఎంతో సులువుగా విద్య నేర్చుకుంటారని తెలిపారు. పాఠశాలలో ఒకటో తరగతిలో చేరే సమయానికే పిల్లలు చదవడం, రాయడం నేర్చుకుంటారని తెలిపారు. అంతేకాకుండా పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, మహిళా పోలీసు ఎస్‌కే బాదుల్లాబి, పంచాయతీ కార్యదర్శి బత్తల మధు, డీఏ డి.లావణ్య, డబ్ల్యూఏ పి.సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్త పి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



వెంకటాచలం: జాతీయ సమైక్యతా శిబిరానికి హాజరైన వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి కాకుటూరులో శనివారం అభినందించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు బెంగళూరులోని బెంగళూరు సిటీ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరానికి వీఎస్‌యూ నుంచి 10 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు హాజరై శనివారం వీఎస్‌యూకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతా శిబిరంలో నేర్చుకున్న అంశాల గురించి వలంటీర్లను అడిగి తెలుసుకున్న వీసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రఘురామయ్య

కొడవలూరు: ప్రతి చిన్నారి చదువుకోవడం ద్వారా బంగారు భవిష్యత్తు పొందవచ్చని కావలి డిప్యూటీ ఈఓ పి.రఘురామయ్య సూచించారు. ‘నేను బడికి పోతా’ కార్యక్రమంలో భాగంగా కొడవలూరులోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆ గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారి విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అందులో భాగంగానే ‘నేను బడికి పోతా’ కార్యక్రమాన్ని అమలు చేసి బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారిని బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 జి.వసంతకుమారి, ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, హైస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు

నెల్లూరు(సెంట్రల్): రైతులు వారి పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవడం ఎంతో మేలని వ్యవసాయ శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల వల్ల పంటలకు ఎంతమేర ఎరువులు వినియోగించవచ్చో తెలుసుకోవచ్చన్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. ఈ సమస్యలకు భూసార పరీక్షలే పరిష్కారమన్నారు. ప్రధానంగా భూసార పరీక్షలు చేయించుకునే సమయంలో మట్టి సేకరణ అనేది చాలా ముఖ్యమని తెలిపారు. ప్రధానంగా 15 సెంటీమీటర్ల వరకు పారతో గుంట తవ్వి అందులో పై పార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

మోసగించారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని 37వ డివిజన్‌కు చెందిన జగ్గారావు, నవాబుపేటకు చెందిన అవినాష్‌లు తమకు సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నగరానికి చెందిన శ్రీనివాసయాదవ్ అనే వ్యక్తి మోసగించాడని శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఫ్యానుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణ్‌లాల్(20) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం నెల్లూరు నగరానికి వచ్చారు. టైల్స్ పనులు చేసుకుంటూ మాగుంటలేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల వివాహమైంది. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శుక్రవారం తానుంటున్న గదిలోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు శనివారం రాత్రి నెల్లూరుకు చేరుకుని లక్ష్మణ్‌లాల్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నెల్లూరు(టౌన్): విద్యార్థి దశలో బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎం సుందరవల్లి తెలిపారు. స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటై 105 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలను అభినందించారు. అనంతరం నవోదయ విద్యాలయం, వీపీఆర్‌లో సీట్లు పొందిన ఆరుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి ఉషాకిరణ్, సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, కార్పొరేటర్ మహేష్, డాక్టర్ సునీత, ఎంఈఓలు అబ్దుల్‌హమీద్, మురళీధర్, హెచ్‌ఎం భాస్కరరావు, బీటీఏ నాయకులు వేణుగోపాల్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



‘నేను బడికి పోతా’ కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్ సూచించారు. మండలంలోని చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత ఉపాధ్యాయులు శనివారం గ్రామంలో ‘నేను బడికి పోతా’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీగా మహాలక్ష్మీపురం సెంటర్‌కు చేరుకొని మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాయి ప్రసాద్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ‘నేను బడికి పోతా’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ‘నేను బడికి పోతా’ కోఆర్డినేటర్ ఫణికుమార్, ఉపాధ్యాయులు విద్యాధరి, రమణప్రసాద్, సులోచన, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

దోమలను నివారిద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

కొడవలూరు: దోమలను నివారించుకొని వ్యాధులను పారదోలుదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ అన్నారు. దోమల వల్ల అనర్థాలపై శనివారం మండలంలోని నార్తురాజుపాళెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారాలు, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. రాత్రిళ్లు విధిగా దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయమ్మ, వై.రాజమ్మ, ఆర్.సునీల్, పి.భారతి, వై.మంజుల, ఏఎన్‌ఎం డి.దీనమ్మ, ఆశా కార్యకర్తలు జి.రమ, జి.సరళ పాల్గొన్నారు.

ధరలు పెరగకుండా చర్యలు తీసుకోండి

- జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఉల్లిపాయలు, టమాటాల ధరలు పెరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఎండలకు టమాటాలు, ఉల్లిపాయలతోపాటు ఇతర కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, దీంతో ధరలు పెరిగాయని అధికారులు జేసీకి వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టమాటాలు, ఉల్లిపాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి సేకరించి రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. మార్కెటింగ్, పౌరసరఫరాలు, తూనికలు కొలతలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ ద్వారా వ్యాపారులు దుకాణాలు, గోదాముల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎవరైనా అవసరానికి మించి ఎక్కువ నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, తూనికలు, కొలతల డీసీ ఇసాక్, రైతుబజార్ అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ‘నేను బడికి పోతా’ కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరూ బడికి వెళ్లి చదువుకోవాలనే లక్ష్యంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు ఉర్దూ డీఈఓ ఖాజామెహిద్దీన్ అన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) పెంచలయ్య, ఏపీఓ ప్రసాద్, ఐటీడీఏ సిబ్బంది శాంతకుమారి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం సందానీబాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.